


# కోళ్ళ పందెం

ఊరిరి సర్పంచు నర్సిరెడ్డి. ఊరి కర్నం భూపాల్ రావు. అల్లి ద్దరి పొలాలు పక్కపక్క నున్నయ్ గన్క వొరాలు కల్సున్నయ్.

అసలు జరిగిన సంగతేందంటే—

"గా నర్సిరెడ్డి వొరాలు గట్టేసి నీల్లు మన పొలంల కిడువ్"—అంట జెప్పిండు భూపాల్‌రావు ఆయన జీతగాన్కి - మైసయ్య ఆయన దగ్గర జీతమున్నడు గన్క శెప్పినట్టు జేశిండు.

మరి సర్పంచు ఊకున్నాడు?—ఊకోలె.

"గా కర్నపాయన ఏమనుకుంటాడు గావొచ్చు? శెర్ల నీల్లన్ని ఒక్కడే పెట్టుకుంటడా? నిన్నటి దాక మల్పుకున్నది సాలు. ఇయ్యాల పొద్దు అయిన వొరాలు గట్టేసి, నీల్లన్ని మన పొలంలకు మర్లియ్. శేనంత తెర్లియుండొచ్చు."—అంటని కోప్పడుకుంట జీతగానికి జెప్పిండు సర్పంచు. పెద్దులు ఆయన తాన జీతానికున్నడుగన్క శెప్పినట్టు జేశిండు—

ఇగో గంతే-అది యింతవాయె. అంతవాయె, యిద్దరికి పెద్ద జగడ మాయె!!

మైసయ్య పెద్దులు యిద్దరు దగ్గరోల్లు. ఒకలంటె ఒకలికిపానం పంచాయతి పెట్కోవాలని లేనేలేదు గని' ఈ దొరల దగ్గర జీత ముండాలంటె ఆల్ల రోకు మాట్లాడాల్నాయె. గట్ల మాటలల్లనె ఉత్త్ర త్తగ రోశాలు పెరిగె.

''ఆడేమో నీల్గుతాండు సూస్తవేందిర? నాల్గుతన్ను ఆన్ని-'' అని ఎగేశిండు నర్సిరెడ్డి మైసయ్యను, మిగిల్న జీతగాండ్లను.

'అగో నీకె శాతనయిత లేదార? గాజుల్దొడ్కున్నావుర ముండ కొడ్క, పొయి ఆని మద మణసక ఇంకేమో జూస్తవూ?''

''ఓరి వారి! గట్ల నిలిబడేం జూస్తాండ్రు? పోండ్రి అందరు గల్సి పోండ్రి''-అని ధైర్యం బలికిండు భూపాల్‌రావ్ పెద్దులుకు, మిగిలిన జీతగాండ్లకు.

ఇగ కర్నం జీతగాండ్లు, సర్పంచు జీతగాండ్లు ఒగని మీద ఒకడు పడి కొట్టుకునుడే గాదు. ఇగ గప్పటి కోపాలు యేర్పడ్తయా ఏమన్ననా? కట్టెలక్కట్టెలే యిర్గినయ్. పుర్రెలకు పుర్రెలే లేశినయ్. అంత రగతం. పచ్చని పొలాల మీద ఎర్రెర్రగ...... ఆతొక్కుళ్ళ రకతమంత బురదేల గలిశి-రకతం బురద! బూరద!! ''బూదేవి కోపాని కొచ్చినట్టు'-మన్నంత ఎర్రగ.

అంతయి పోయినంక జూస్తేమున్నది? అంతయిపోయింది. మైస య్యకు కాలిరిగింది. పానాలు ఎవ్వలియీ పోలె.

''ఓరి దొమ్మరి కొడ్క. ఏదో నాల్గు తన్నమని శెప్పిన గని కాలిరుగ్గొట్టు మన్నాను''?-అని పెద్దుల్ని తిట్టి జారుకున్నాడు కర్నం.

"నీ లేవలేని సట్టంకునా బారేద్దు. గాయింత శాతగానిది గంత గనం మీదిమీది కుర్కినావ్ర? శాత గానోనివి ఊకుండనుంటివి"-అంటని నర్సిరెడ్డి మైసయ్యను కోప్పడుకుంట తోకపీకిండు జల్జిన.

కేసు అదాలత్ కచ్చీర్లకు పొయ్యింది. పెద్దుల్ని జైల్లేశింద్రు. మైసయ్యను దవాకాండ్లేశింద్రు. దెబ్బలు శిన్నశిన్నగ తాకి నోల్లకు తక్వయినయ్.

ఇగ లోపట్లోపటేమయిందో ఏమో...నర పురుగుకు దెల్వలే. కర్నానికి సర్పంచుకు ఏం గాలె. ఎండ్లెయ్యాలె-అదాలత్‌ల ఫైస్ల అయి పోంగనె యిద్దరు శేతులు గల్పుకోని జబ్బల మీద సేతులేసుకుంట, శిన్నశిన్నగ నగుకుంట బయలెల్లింద్రు.

అల్లిద్దర్ని దూరం నించి జూశిన పెద్దులుకు అల్లిద్దరి కాలు యిరగ్గొడ్తె బాగుండని పిచ్చింది. మైసయ్య కాలు యిరగ్గొట్టాలని కొట్టిండా తను? కొట్లాటకు ఎగబెట్టింది అలేనాయె. ఏదో గుంపుల అడ్డగోలుగ గొట్టబోతె, తప్పిపోయి యిర్గితె, అల్లకేమో ఏంలేదు. నేను బోయి జైలుండాలె? మన్సుల్నే సవాల్లేసు కున్నడు. వాటన్నిటికి జైల్ల నుంచి వచ్చినంకనె జవాబు దొర్కుత నుకున్నడు.

జైల్లకు బొయినంక, సుట్ట ముట్టిచ్చుకునేటప్పుడు అనుకున్నడు పెద్దులు-అగ్గి పెట్టె లోపట పుల్లలు జూశిండు. పెట్టెమీద ఇటు అటు గీతలు జూశిండు పెట్టె లోపట అగ్గిపుల్ల లన్ని పక్కపక్కన కల్శేవుం టయి. బయిటి కొచ్చి బగ్గున మండి దేన్నో ఓ దాన్ని గాలుస్తయ్. అగ్గి పెట్టె మీద అయితె అన్ని గీతలె! లేనోని బత్కు మీద ఉన్నోడు గీసినట్టు—

ఆంధ్రజ్యోతి
20-6-1975